## సిపిఐ అభ్యర్థులను గెలిపించండి : కూనంనేని



2లో

www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 03 | ఫిబ్రవరి | 2026
పేజీలు : 8

# పంచగలిగితేనే పదవులు..!

**-ఆచితూచి వ్యవహరిస్తున్న నేతలు**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఎన్నికలంటే ప్రజాభిమానానికి , ప్రజాసేవకు పరీక్షగా భావించే వారు గతంలో. ఐదేండ్ల కాలంలో ప్రజలకు అందుబాటులో ఉండటం, ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి, నీతి, నిజాయితీ ఎన్నికల్లో గెలుపుకు కొలబద్ధగా ఉండేది. ప్రజలు సైతం అభ్యర్థుల గుణగణాలను చూసి ఓట్లు వేసే వారు. ఆర్థికంగా బలవంతులైన వారు ఎన్నికల్లో పోటీ చేసి ప్రజా క్షేత్రంలో సామాన్యుల చేతిలో ఓడిన సందర్భాలు ఎన్నో. నామినేషన్ ఫీజు సైతం ప్రజలే చెల్లించి నిజాయితీ కలిగిన ప్రజాసేవకులను గెలిపించిన రోజులు ఇప్పుడు కనుమరుగయ్యాయి. ఇప్పుడు కాసులు లేకుండా ఓట్లు రాలే పరిస్థితి లేదు. నాయకుల్లో వచ్చిన మార్పు ఇప్పుడు ఓటర్లను తాకింది. ఓట్లంటే ఐదేండ్ల కాలానికి మనల్ని పాలించే వారు మనపట్ల, మన ప్రాంతం పట్ల నిర్ణయాలు తీసుకునే వారిని ఎన్నుకోవడం అనే ఆలోచన నుంచి ఎన్నికలు వస్తే డబ్బులు వస్తాయి పార్లమెంట్ ఎన్నికలకు ఇన్ని వచ్చాయి,

మిగతా 2లో..

## నేటితో తేలనున్న ప్రత్యర్థులు..!





**-ఉపసంహరణకు నేడు తుది గడువు**
**-బుజ్జగింపుల్లో రాజకీయ పార్టీలు**
**-చర్చలకు తెర**

**ప్రజాపక్షం/ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచే ప్రత్యర్థులెవరో మంగళవారంతో తేలనుంది. ఉపసంహరణకు మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలతో గడువు ముగియనుంది. పలు చోట్ల స్వతంత్రులుగా వివిధ పార్టీల నుంచి రెబల్స్‌గా నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అత్యధికంగా నామినేషన్లు దాఖలు చేశారు. ఈ పరిస్థితిలో ఆయా అభ్యర్థులను ఒక్కొక్కరిగా పిలిచి బరిలో నుంచి తప్పించే ప్రయత్నం చేస్తున్నారు. వార్డుల వారీగా అభ్యర్థులను ఖరారు చేస్తున్నారు. సత్తుపల్లి, వైరా, కల్లూరులో అధికార పార్టీలో పోటా పోటీగా ఉన్నట్లు సమాచారం. వైరాలో అయితే ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రుల అనుచరులు పోటా పోటీగా నామినేషన్లు వేశారు. ఇదే సమయంలో వైరా ఛైర్‌పర్సన్ స్థానం కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. కాంగ్రెస్‌కు చెందిన డిసిసి మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

మిగతా 2లో..

## అభివృద్ధిని చూసి ఓటేయ్యండి

**ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** పదేళ్ల పాటు ప్రజలను గాలికొదిలేసి ఇవాళ ఎన్నికలు రాగానే దండాలు పెట్టుకుంటూ వస్తున్న నాయకులను నమ్ముదామా? పేదోడికి ఓ రేషన్‌కార్డు ఇవ్వడానికి మనసు రాని వాళ్లకు మళ్లీ ఓట్లు వేయాలా? అంటూ తెలంగాణ రెవిన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల

మిగతా 2లో..

## ఉన్నత విద్యావంతుడిని ఆశీర్వదించండి

- సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం
- 24వ డివిజన్లో ముమ్మరంగా సిపిఐ అభ్యర్థి పాండురంగా ప్రచారం



2లో

# పంచగలిగితేనే పదవులు..!

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీకి మరికొన్ని వచ్చాయి, పంచాయతీలకు కొన్ని వచ్చాయి అని డబ్బుల లెక్కలు వేసుకుంటున్నారు తప్ప మనం సరైన అభ్యర్థిని గెలిపించామా లేదా అన్న ఆలోచనను ఓటర్లు మరిచిపోయారు. ఒకవేళ గుర్తున్న వారు కొందరున్నా వారి శాతం బహు స్వల్పం. ఇప్పుడు ఎన్నికలంటే ఖర్చు చేయగలిగిన వారు మాత్రమే బరిలోకి దిగుతున్నారు. ఐదేండ్ల పాటు ఏ వ్యాపారాలు చేసినా, అక్రమంగా సంపాదించినా, ఓటర్లు తమ ఓట్లకు నోట్లు ఇస్తే చాలు అన్న రీతిగా వ్యవహరిస్తున్నారు తప్ప సరైన నాయకున్ని ఎన్నుకోవడంలో మాత్రం తగు రీతిలో శ్రద్ధ కనబర్చడం లేదు. ఎవరు ఎక్కువగా ఓటుకు ధర నిర్ణయించగలిగితే వారిని గెలిపించే పనిలో ఉన్నారు. స్థానికంగా సమస్యల పట్ల అవగాహన, ప్రజలతో సత్సంబంధాలు, రాజకీయ వైఖరి ఇవేమి ఇప్పుడు ఎన్నికల్లో ప్రచార అస్త్రాలు కావడం లేదు. రెండు పార్టీల నుంచి బీఫాం కోసం ప్రయత్నం చేస్తూ నామినేషన్లు వేశారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఆలోచించుకోవచ్చు. ఎవరు బీఫాం ఇస్తే ఆ పార్టీకి జే కొట్టేందుకు అభ్యర్థులు సిద్ధమవుతుంటే ఇక రాజకీయ నిబద్ధత అనేది చర్చనీయాంశమే కావడం లేదు. వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకున్న రాజకీయ పార్టీలు తమ పంథాను కూడా మార్చుకున్నాయి. సంపన్నులు ఓట్ల కొనుగోలు వేటలో నిలబడగలిగిన వారికి టికెట్లను కేటాయిస్తున్నాయి. ఎంత ఖర్చు చేయగలరన్న అంశమే ఇప్పుడు అభ్యర్థిత్వానికి అర్హతగా మారింది. ప్రత్యర్థి ఖర్చు చేసి మనం ఖర్చు చేయకపోతే ఓడిపోతామన్న భావన ఆయా పార్టీ నేతల్లో ఉన్నది. మంచి చెడు కంటే ముందు ఖర్చు చేయగలిగిన మొత్తం వైపు నేతలు చూస్తున్నారంటే అతిశయోక్తి కాదు. బీఫాం ఇచ్చిన తర్వాత ఖర్చు చేయలేకపోతే ఇబ్బంది పడాల్సి వస్తుందని కొన్ని రాజకీయ పార్టీలు ఖర్చు చేయగలిగిన మొత్తాన్ని పార్టీ నాయకుల వద్ద పెట్టాలంటూ షరతు విధిస్తున్నారు. ఓటర్ల ఆలోచనకు అనుగుణంగానే నేతలు, వారి ఆలోచలను బట్టి ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపిక అంటే ఖర్చు చేయడం అన్న అంశంపైనే ఆధారపడి అర్హతను నిర్ణయిస్తున్నారు. చిన్న చిన్న పంచాయతీల్లోనే లక్షల రూపాయలు ఖర్చు చేసిన నేపథ్యంలో మున్సిపాలిటీలో పెద్ద మొత్తం ఖర్చు చేయక తప్పదని నేతలు అభ్యర్థులను హెచ్చరిస్తున్నారు. ఖర్చుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపిన అభ్యర్థులనే పరిశీలనలోకి తీసుకుంటున్నారు. దీనిని బట్టి పంచగలిగిన వారికే బీఫాం ఆ తర్వాత గెలుపు దక్కే అవకాశం ఉంది.

# అభివృద్ధిని చూసి ఓటేయ్యండి

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బిఆర్ఎస్‌పై విరుచుకుపడ్డారు. సోమవారం ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 2,22,23,24,26,27వ వార్డుల్లో నిర్వహించిన రోడ్‌షోల్లో మంత్రి ప్రసగించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన ఏ సంక్షేమం అర్హులదరి చేరకుండా వారిని నమ్మించి మోసం చేసిన ఘనత ముమ్మాటికీ వారిదేనని ఎద్దేవా చేశారు. ఇప్పుడు తాము చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విష్రప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వ తీరుపై పొంగులేటి తనదైశైలిలో సెటైర్లు వేశారు. నాడు ఫామ్‌హౌస్‌లకే పరిమితమై, గాలి మోటర్లలో తిరిగిన నాయకులకు..ఈ గల్లీల్లో డ్రైనేజీలు పొంగుతుంటే, ఇళ్లు మునుగుతుంటే ఏనాడైనా కనిపించాయా? అని నిలదీశారు. రాజీవ్‌గృహకల్పవాసులు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోని వారు. ఇవాళ ఎన్నికల కోసం కొత్త నాటకాలు ఆడుతున్నారని అన్నారు. తాము అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి పేదోడికి రేషన్‌కార్డులు ఇచ్చి ఆకలితీర్చామని, అది కాంగ్రెస్ మార్కుపాలన అని చెప్పారు.

**ముంపు కష్టాలకు రిటైనింగ్ చెక్...**

మాట ఇస్తే మడమతిప్పే అలవాటు తనకు లేదన్నారు. జూన్ కల్లా కరకట్ట పూర్తి చేసి మీ ముంపు కష్టాలు తీర్చితీరుతా అని మంత్రి మరోమారు హామీ ఇచ్చారు. రూ.690కోట్లతో నిర్మిస్తున్న రిటైనింగ్‌వాల్



ఏదులాపురానికి రక్షణ కవచంలా మారుతుందని, రాజీవ్‌గృహకల్ప ఇళ్లకు కొత్తహంగులు అద్దడంతో పాటు ప్రతి ఇంటికీ నల్లా నీరు ఇచ్చే బాధ్యత తనదేనన్నారు. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో కలిపి సుమారు రూ.308కోట్లతో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని ఏదులాపురాన్ని రాష్ట్రానికి రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దు తానని పేర్కొన్నారు. అభివృద్ధి కావాలంటే హస్తం గుర్తుకే ఓటేయాలని, కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పొంగులేటి పిలుపునిచ్చారు.

# ఉన్నత విద్యావంతుడిని ఆశీర్వదించండి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఉన్నత విద్యావంతుడైన రిటైర్డ్ డిప్యూటి కలెక్టర్ నూనావత్ పాండురంగాని ఆశీర్వదించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంత్‌రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 24వ డివిజన్లో గల సూర్యనగర్‌లో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో అభ్యర్థి గెలుపుకై ముమ్మర ప్రచారాన్ని నిర్వహించారు. తొలుత అక్కడి ఆర్చి నుంచి ఎర్రజెండాల రెపరెపలతో, మహిళల జై సిపిఐ నినాదాలతో కొనసాగింది. ఈ సందర్భంగా భాగం హేమంత్‌రావు అభ్యర్థి నూనావత్ పాండురగంతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిశారు. ఆర్‌డీఓగా ప్రజలకు సేవలనందించి, ఇప్పుడు రాజకీయంగా ప్రజలకు అండగా ఉండేందుకు వచ్చారన్నారు. తను సర్వీస్ నిర్వహించిన 35 సంవత్సరాలలో ఎక్కడా మచ్చ లేకుండా పని చేసి, అధికారుల మన్ననలను పొందారన్నారు. అటువంటి వ్యక్తి కౌన్సిలర్గా ఉండటం వలన ఈ ప్రాంతానికి గర్వకారణంతో పాటు అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. కావున ప్రజలు నిండు మనసుతో కంకికొడవలి గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ప్రచారం మొత్తం ఎంతో ఉత్సాహంగా ప్రజల ఆదరణతో విజ



యవంతంగా సాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు అజ్మీరా రామ్మూర్తినాయక్, కూచిపూడి రవి, జిల్లా సమితి సభ్యుడు బానోత్ రాంకోటి, సిపిఐ ఖమ్మంరూరల్ మండల సహాయకార్యదర్శి బానోత్ రామ్మూర్తి, సిపిఐ శాఖ సెక్రటరీ నాగరాజు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టాఫ్ (పిఓ)ల శిక్షణ కార్యక్రమం

**ప్రజాపక్షం/కల్లూరు:** మున్సిపాలిటీ సెకండరీ ఎలక్షన్ల సందర్భంగా కల్లూరు మున్సిపాలిటీ సెకండరీ ఎలక్షన్ల భాగంగా పోలింగ్ స్టాఫ్ (పిఓ)ల శిక్షణ కార్యక్రమం మున్సిపాలిటీ పరిధిలోని గవర్నమెంట్ హై స్కూల్‌లో పోలింగ్ ఆఫీసర్లు (పీఓలు), ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ పాల్గొని, ఎన్నికల ప్రక్రియలో జాగ్రత్తలు, బాధ్యతలు, సూచనలు, సలహాలు అందించారు. ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌ల వద్ద జరిగే పనులు, ఓటర్లకు సహాయం, రికార్డుల ఖచ్చితత్వం వంటి అంశాలపై సబ్ కలెక్టర్ వివరంగా చర్చించారు. మాస్టర్ ట్రైనీ (టిఓటి)ల ద్వారా 41 మంది పిఓ లకు శిక్షణ అందిచడం జరిగింది. ఈ కార్యక్రమంలో



మున్సిపల్ కమిషనర్ ఏం. రామదుర్గారెడ్డి, ఎలక్షన్ స్పెషల్ ఆఫీసర్ చలపతిరావు, ఎమ్మార్వో సాంబశివుడు, మాస్టర్ ట్రైనిస్ మురళి మోహన్, చెన్నకేశవ రెడ్డి, సత్యం, ఎన్నికలస్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

## సిపిఐ అభ్యర్థులను గెలిపించండి : కూనంనేని

**ప్రజాపక్షం/పాల్వంచ :** కార్పోరేషన్ పరిధి పాల్వంచ డివిజన్‌లో కంకీ కొడవలి గుర్తుపై మీ అమూల్యమైన ఓట్లేసి సిపిఐ తరుపున పోటీ చేయుచున్న అభ్యర్థులను గెలిపించాలని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం పాల్వంచలోని 40వ, డివిజన్ రాంనగర్ ఏరియా, 44వ, డివిజన్ శ్రీనగర్ ప్రాంతంలో 38వ, డివిజన్‌తో ఎస్‌కేటి అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాలలో సిపిఐ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా కూనంనేని మాట్లాడుతూ పాల్వంచ పట్టణం మరింత అభివృద్ధి కావాలంటే సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎన్నికలు లేకపోవటంతో అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిన పాల్వంచను కొత్తగూడెం కార్పోరేషన్‌లో కలిపి ఎన్నికలను తీసుకొచ్చామన్నారు. దీనితో కొలువుదీరనున్న పాలక మండలితో డెవలప్‌మెంట్ పనులు మెరుగుపడతాయన్నారు. ప్రజల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. కోట్ల నిధులతో ఇప్పటికే పాల్వంచలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కూల్చివేసిన విద్యుత్ ప్లాంట్ స్థానంలో మరో రెండు 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ కేంద్రాలను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. గత ఎన్నికలలో పాల్వంచ నుండి అధిక మెజారిటీ ఇచ్చి నన్ను గెలిపించిన ప్రజలు కార్పోరేషన్ ఎన్నికలలో కూడా అదే ఫలితాలను పునరావృతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, నాయకులు వీసంశెట్టి విశ్వేశ్వర్‌రావు, వైఎస్‌గిరి, ఆదాం, జిల్లాకార్యవర్గ, మండలనాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నేటితో తేలనున్న ప్రత్యర్థులు..!

(మొదటిపేజీ తరువాయి)

సతీమణి ఇందుమతి, కాంగ్రెస్ నాయకులు బొర్రా రాజశేఖర్ సతీమణి ఉమాదేవి ఛైర్‌పర్సన్ స్థానాన్ని ఆశిస్తున్నారు. ఇదే క్రమంలో ఇరు వర్గాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో వార్డుల్లో నామినేషన్లు వేశారు. ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్, సిపిఐ మధ్య కూడా పొత్తుల వ్యవహారం ఒక కొలిక్కి రాలేదు. వైరాలో 15వ వార్డు నుంచి పోటీ చేసిన సిపిఐ అభ్యర్థికి బిఆర్ఎస్, సిపిఎం పార్టీలు మద్దతు పలకడం గమనార్హం. మధిర, కల్లూరు, సత్తుపల్లిలో సిపిఐ అభ్యర్థులకు సంబంధించి ఎటువంటి ఒడంబడిక కడపటి వార్తలు అందే సమయానికి కుదరలేదు. ఏదులాపురంలో ఒంటరి పోరుకే సిపిఐ సై అంటుంది. ఇప్పటికే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కంకి కొడవలి గుర్తుకు ఓటేసి సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఖమ్మం పార్లమెంట్ నియోజక వర్గ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జిగా ఉన్న కొండా సురేఖ రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించిన ఫలితం లేకపోయింది. ఐక్యంగా ఉండమని ఉద్బోదించారు తప్ప ఐక్యత కోసం చర్చలు జరపలేదు. పార్టీ నిర్ణయించిన వారికి బిఫాం ఇస్తామని బిఫాం దక్కిన వారిని అందరూ కలిసి గెలిపించాలని పార్టీ నిర్ణయాన్ని కాదంటే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. బిఆర్ఎస్, సిపిఎంలు ఐక్యంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి.

## జనసేన అభ్యర్థులకు బీఫాం అందచేత

**ప్రజాపక్షం/ మధిర టౌన్ :** మధిర మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న జనసేన అభ్యర్థులకు పార్టీ జిల్లా కో ఆర్డినేటర్ మిర్యాల రామకృష్ణ బీఫాంలను సోమవారం అందచేశారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు అభ్యర్థి దేవినేని వెంకటేష్, 18వ వార్డు అభ్యర్థి సాయి



తేజ్, 21 వార్డు అభ్యర్థి మోదుగు రమ్య, 17వ వార్డు అభ్యర్థి అనంత శివరామకృష్ణ, 14వ వార్డు అభ్యర్థి మందడపు రామకృష్ణ , జనసేన పార్టీ నాయకులు తాళ్లూరి డేవిడ్, అనుమోలు నరేష్, పగడాల పవన్‌కుమార్, జొన్నలగడ్డ భద్ర, దేవినేని మహేష్, తాళ్లూరి గోపి పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత

**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల పరిధిలోని పొగళ్ళపల్లి గ్రామం వద్ద 14 ఆవులను(గో సంతతి)బజరంగ్దల్ కార్యకర్తలు పట్టుకున్నారు. పట్టుకున్న ఆవులపై ఎస్ఐ మధు ప్రసాద్‌కు సమాచారం అందించారు. ఈవిషయంపై ఆయన విచారించగా ఆంధ్రప్రదేశ్ నుండి గోదావరి నది దాటించి తిరువూరుకి అక్రమంగా తరలిస్తున్నా



రని తెలియడంతో కేసు నమోదు చేసి పాల్వంచలోని అన్నపూర్ణ గోశాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో బజరంగ్దళ్ జిల్లా గోరక్షా ప్రముఖ్ బొమ్మగాని దేవేందర్, పొన్నూరు భానుతేజ, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాదినేని సునీత ముమ్మర ప్రచారం

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో సిపిఎం బలపరిచిన బిఆర్ఎస్‌పార్టీ అభ్యర్థి మాదినేని సునీత సోమవారం వార్డులోముమ్మరంగా ప్రచారాన్ని కొనసాగించారు. సునీత ఎన్నికల ప్రచారానికి ప్రారంభం నుంచే అన్ని వర్గాల ప్రజల నుంచి జోరుగా మద్దతు లభిస్తూ ఉంది. ప్రచారంలో



భాగంగా వైరా మాజీ శాసనసభ్యురాలు వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు వార్డు ప్రజలను కలిగిన చంద్రావతి కారు గుర్తుకు ఓటు వేసి మాదినేని సునీత కారు గుర్తుకు ఓటు వేసి మాదినేని సునీతను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వార్డులో సిపిఎం, బిఆర్ఎస్ నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లా రాంబాబు, కొల్లా నాగమణి, నాళ్ళ వసంత, రంగా వాసవి, మిట్టపల్లి సరిత, కొడుమూరి మాధవి, తిరుమల, పెనుగొండ రాణి, సరోజిని, మిట్టపల్లి పద్మ, విజయ, రంగ ఝాన్సి, అనూష తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలి



## -ప్రజావాణిలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజల దరఖాస్తులను అధికారులు ప్రాధాన్యతనిచ్చి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన సుజాత ఉపాధి కొరకు స్వీపర్ పోస్టు ఇప్పించాలని దరఖాస్తు చేశారు. సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామస్తులు గ్రామంలోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం పంపింగ్ వెల్ రోడ్డుకు చెందిన పిడకల రాంబాయి తనకు ఇల్లు లేదని డబుల్ బెడ్ రూం ఇల్లు కేటాయించాలని దరఖాస్తు చేశారు. వైరాకు చెందిన ఎస్కె గాలిబి తనకు స్థలం ఉందని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. తిరుమలాయపాలెం మండలం సుబ్లేడుకు చెందిన వెంకటమ్మ తన భర్త 2023లో మరణించాడని తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల్లో పనిచేసి జనవరి 31న ఉద్యోగ విరమణ పొందిన ఏడుగురు అధికారులు, సిబ్బందిని కలెక్టర్ సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దలు పనిలో పిల్లలు బడిలో ఉండాలి



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** పెద్దలు పనిలో పిల్లలు బడిలో ఉండాలన్నదే తన ఉద్దేశమని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వేమిశెట్టి మోహన్‌దాస్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా శ్రీరంగపట్నంకు చెందిన దుర్గారావు, రాజేశ్వరిలు బతుకుదెరువు కోసం మం డల పరిధిలోని శివాయిగూడెం వద్ద టైల్స్ ఫ్యాక్టరీలో కూలీలుగా పనిచేస్తున్నారు. వారికి కుమార్తె అంజలి, కుమారుడు రాజు ఉన్నారు. వారి పిల్లలు బడికి వెళ్లకుండా పని ప్రదేశంలోనే ఉంటున్నారని తెలుసుకున్న రిటైర్డ్ హెచ్ఎం మోహన్‌దాస్ వారి తల్లిదండ్రులను కలిసి చదువు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. సమీపంలోని మంచుకొండ ప్రాథమిక పాఠశాలలో అంజలిని రెండవ తరగతి, రాజును ఒకటవ తరగతిలో చేర్పించారు. ఇరువురిని పాఠశాలలో చేర్చుకున్న హెచ్ఎం బి. రమణకు మోహన్‌దాస్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మోహన్‌దాస్ మాట్లాడుతూ 2025లో జూన్ లో ప్రభుత్వం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో కూడా ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేసినట్లు ఆయన తెలిపారు. పిల్లలు లేకుండా మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను అధికారులు, తోటి ఉపాధ్యాయుల సహకారంతో ఈ ఏడాది జూన్ లో బడిబాటలో విద్యార్థులను చేర్పించి పాఠశాలలను పునఃప్రారం భించేందుకు తన వంతు కృషి చేస్తానని మోహన్‌దాస్ తెలిపారు.

# ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ తల్లాడ :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక వ్యతిరేక విధానాలు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని జాతీయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఫిబ్రవరి 12న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదంచేయాలని ట్రేడ్ యూనియన్ సెంట్రల్ ఆఫ్ ఇండియా ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్.లాల్మియా పిలుపునిచ్చారు. సోమవారం తల్లాడలో సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడులుగా విభజించిందని, ఏప్రిల్ 1వ తేదీ నుండి ఈ నాలుగు లేబర్ కోడ్‌లు అమలు కాబోతున్నాయని, దీని వలన కార్మికులకు నష్టదాయకంగా ఉన్నాయని, వెంటనే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును కూడా జిరాంజి పేరుగా మార్చేందుకు ప్రయత్నం చేస్తున్నారని, మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని పునరద్దించాలని, కార్మికులు పోరాడి సాధించకున్న హక్కుల రక్షించేందుకు చేపట్టనున్న సార్వత్రిక సమ్మెలో పెద్ద ఎత్తున్న సంఘటిత, అసంఘటిత కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ తల్లాడ బ్రాంచ్ కమిటీ నాయకులు సిహెచ్ రామకృష్ణ, రాఘవవెంకటేశ్వర్లు, చిన్న సైదులు, ఉమా మహేష్, నాగయ్య, వెంకటేశ్వర్లు, ఉపేందర్, రాకేష్, పిచ్చయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించండి

## వైరాలో మాజీ ఎమ్మెల్యే చంద్రావతి ప్రచారం





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో బిఆర్ఎస్, సిపిఎం పార్టీల కౌన్సిలర్ అభ్యర్థుల గెలుపుని కాంక్షిస్తూ సోమవారం వైరా మాజీ శాసనసభ్యురాలు బానోతు చంద్రావతి ఆ వార్డు కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. 5వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, మున్సిపాల్ చైర్‌పర్సన్ అభ్యర్థి అయిన కట్టా స్వరూపరాణి విజయాన్ని కాంక్షిస్తూ వార్డులో ప్రచారం నిర్వహించారు. 6వ వార్డులో సిపిఎం అభ్యర్థి మాదినేని రజిని విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. 5వ వార్డులో బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి మాదినేని సునీత విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. 5వ వార్డులో బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి మాదినేని సునీత విజయాన్ని కాంక్షిస్తూ చంద్రావతి గడపగడపకు ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బానోతు చంద్రావతి మాట్లాడుతూ ఈ నెల11న జరిగే మున్సిపాల్ ఎన్నికల్లో బిఆర్ఎస్, సిపిఎం కౌన్సిలర్ అభ్యర్థులను వారి గుర్తులపై ఓటు వేసి గెలిపించాలని ఆమె ప్రజలను కోరారు. కెసిఆర్ పాలనలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు, రైతులు సంతోషంగా ఉన్నారని, అన్ని వర్గాల అభివృద్ధి ధ్యేయంగా కెసిఆర్ పనిచేశారని ఆమె గుర్తు చేశారు. మళీ లప్రజలు రాష్ట్రంలోకెసిఆర్ పాలన కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ వార్డు సభ్యులు, పలువురు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

# పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేయూత



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రతిభావంతులకు పేదరికం, ఆర్థిక సమస్య అడ్డుకాకూడదనే ఆశయంతో పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చార్టెర్డ్ అకౌంటెంట్ (సిఏ) చదువుతున్న విద్యార్థినికి అండగా నిలిచింది. ఖమ్మం ముస్తఫానగర్‌కు చెందిన తీర్థాల స్పందన ప్రతిభ చాటి పదవ తరగతి ఇంటర్ పూర్తి చేసి తనకున్న ప్రతిభలో సిఏ చేయాలనే లక్ష్యంతో ప్రవేశం పొందినప్పటికీ కుటుంబ పరంగా ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటుంది. తన కుమార్తె ఉన్నత విద్యకు చేయూతనందించాలని కుటుంబ సభ్యులు ట్రస్ట్ సభ్యులను సంప్రదించారు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు ట్రస్ట్ తరుపున చేయూతనందిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ట్రస్ట్ ఛైర్మన్ పరిశ పుల్లయ్య సోమవారం ట్రస్ట్ సభ్యులు మహంకాళి స్వరాజ్యలక్ష్మి , మురళీ కృష్ణ దంపతుల ఆర్థిక సౌజన్యంతో రూ. 20వేల చెక్కును విద్యార్థిని స్పందనకు అందించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మహంకాళి స్వరాజ్య లక్ష్మి , పరిశ లక్ష్మి రాజ్యం గొండేల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ సదస్సుకు కొణిజర్ల ఉపాధ్యాయుడికి ఆహ్వానం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల కేంద్రం కొణిజర్ల హైస్కూల్‌లో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న భాస్కర్‌రావు మోంద్రు కు అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం లభించింది. ఈనెల 7,8 తేదీల్లో జరగనున్న 30వ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ ఇంగ్లీష్ భాషా భోధనా రీసెర్చ్ పేపర్‌ను ప్రదర్శించేందుకు ఆయనకు అధికారికంగా ఆహ్వానం అందినట్లు భాస్కర్‌రావు మోంద్రు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ విద్యార్థులను శక్తివంత చేసే ఇన్నోవేటివ్ ఆల్‌బేస్డ్ టీచింగ్ ప్రాక్టీస్‌పై ఆయన రచించిన పరిశోధనా పత్రం అంతర్జాతీయ అకాడమిక్ కమిటీ ద్వారా పీర్‌రివ్యూ చేయబడి ఆమోదం పొందిందనట్లు తెలిపారు. ఇది గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల తరగతుల నుంచే ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించిన పనికి నిదర్శనం. ఈసదస్సుకు దేశవ్యాప్తంగా కేవలం ముగ్గురికి మాత్రమే ఎంపికి కాగా రెండు తెలుగు రాష్ట్రాలనుంచి భాస్కర్‌రావు మోంద్రు మాత్రమే ఏకైక ఉపాధ్యాయుడు ఎంపిక కావడం విశేషం. 2025 ఆగష్టు 1, 2 తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించిన ఆల్ఇన్ ఎడ్యుకేషన్ వికసిత్ భారత్ పాల్గొన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ 2025 సెప్టెంబర్ 5న సత్కరించినట్లు తెలిపారు.

# చలో ఢిల్లీ మార్చ్‌ను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ బోనకల్ :** ఫిబ్రవరి 5న పార్లమెంట్ సమావేశాలు సందర్భంగా జాక్టో ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో ఢిల్లీ మార్చ్ టు పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జాక్టో సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రం బోనకల్‌లో చలో ఢిల్లీ మార్చ్ టు పార్లమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని, నూతన ఫెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, నూతన జాతీయ విద్యావిధానం 2020ని రద్దు చేసి శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శాసనమండలిలో ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని, పాఠశాలల విలీనం, మూసివేతలను ఉపసంహరించుకోవాలని తదితర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎఐజాక్టో ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న చేపట్టనున్న చలో ఢిల్లీ మార్చ్‌టు పార్లమెంట్ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, పిఆర్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు చింతల రవికుమార్, టిఎస్‌యూటీఎఫ్ జిల్లా నాయకులు సద్దాబాబ, మండల అధ్యక్షులు చిన్న రంగారావు, ఉపాధ్యక్షులు పి.గోపాలరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సిఎం కప్ క్రీడాపోటీలు ప్రారంభం





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడీఓ రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం రూరల్ మండలంలోని మంగళగూడెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడాప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోటీలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు...క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి పోటీల్లో పాల్గొనాలని క్రీడాకారులకు సూచిం చారు. ఇక్కడ చూపించే ప్రతిభ రేపు రాష్ట్ర, దేశ స్థాయిలో రాణించేందుకు ఉపయో గపడుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ క్రీడలలో ప్రతిభ చాటాలన్నారు. ఇక్కడ 5 క్లస్టర్లకు సంబంధించిన క్రీడాకారులతో పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంఈఓ యం శ్రీనివాస్, సర్పంచ్ మేకల సత్యనారాయణ, ఉప సర్పంచ్ అనిల్, ప్రధానోపాధ్యాయులు బి . శ్రీనివాస్, వెంకట్రావు, బొడ్డు కోటయ్య, పీటీలు పాల్గొన్నారు.

# నాగరాజును పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న బిఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షులు పగడాల నాగరాజును మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సోమవారం పరామర్శించారు. కేసిఆర్‌ను సిట్ విచారణకు పిలిచిన సందర్భంగా ఖమ్మంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పగడాల నాగరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జిల్లా జైలును సందర్శించి పగడాల నాగరాజును పరామర్శించి ధైర్యం చెప్పారు. అక్రమ కేసుల పట్ల ఆందోళన చెందవద్దని తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. త్వరలోనే బెయిల్‌పై విడుదల చేయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, ఖమ్మం కార్పోరేషన్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, సొసైటీ మాజీ అధ్యక్షులు బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళీ, దేవభక్తిని కిషోర్, నర్సింహారావు, మేదరమెట్ల రాంబాబు ఉన్నారు.

### నాగరాజు కుటుంబాన్ని పరామర్శించిన తాతా మధు



బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సందర్భంగా పగడాల నాగరాజు సతీమణి 53వ డివిజన్ కార్పొరేటర్ పగడాల శ్రీవిద్యను వారి స్వగృహంకు వెళ్లి ఖమ్మం బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ పరామర్శించారు. అక్రమ కేసుల పట్ల ఆందోళన చెందవద్దని పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యాల వెంకటప్పారావు, బలుసు మురళీకృష్ణ, సద్దాం షేక్, మహ్మద్ రఫీ, షేక్ షకీనా, చిన్న నాగరాజు, గోపి, ఉస్మాన్, వీరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సిసి డ్రైన్ల నిర్మాణానికి మేయర్ శంకుస్థాపన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 32వ డివిజన్‌లో సిసి డ్రైన్ నిర్మాణ పనులకు మేయర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపన చేశారు. సోమవారం డివిజన్ పరిధిలో రూ. 25 లక్షలతో నిర్మించనున్న సిసి డ్రైన్ పనులకు మేయర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు కార్పోరేషన్ ఆధ్వర్యంలో డ్రైన్ల నిర్మాణం చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. పనుల్లో నాణ్యతలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం మేయర్ జమలాపురం కేశవరావు పార్కులో నూతనంగా నిర్మించిన ప్రజా మరుగుదొడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దోన్‌వాన్ సరస్వతి, మాజీ కార్పొరేటర్ రమాదేవి, నాయకులు శంకర్ నాయక్, ఉమేష్, తోళ్ల రాకేష్, కుటుంబరావు, తేజావత్ శ్రీను, మన్నేపల్లి నగేష్, జగదీష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో పాల్గొన్న మేయర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. వాటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలిపేందుకు కార్పోరేషన్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేయర్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, ఈఈ కృష్ణలాల్, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిఎం కప్‌లో రెజొనెన్స్ విద్యార్థుల ప్రతిభ




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సిఎం కప్ క్రీడా పోటీల్లో ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ మైదానంలో జనవరి 28 నుంచి 31 వరకు జరిగిన ఈ పోటీల్లో ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీల్లో రెజొనెన్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన ఎన్. భువనచంద్ర 600 మీటర్ల లో మూడవ స్థానం, 60 మీటర్ల విభాగంలో రెండవ స్థానం సాధించాడు. ఎం. యశ్వంత్ 600 మీటర్ల విభాగంలో మూడవ స్థానం సాధించాడు. ఫుట్‌బాల్‌లో ఎస్‌కె అఫ్రోజ్, మైఖేల్, అపురూప్‌లు ఉత్తమ ప్రతిభ చూపి సీనియర్, జూనియర్ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం జరిగిన అభినందన సభలో పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణిలు మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి కనబర్చేలా తమ పాఠశాలలో శిక్షణ అందిస్తున్నామన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం కలుగుతుందన్నారు. ప్రతిభ చూపి బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పివిఆర్ మురళీమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్‌పై దాడికి ఖండన



**ప్రజాపక్షం/కల్లూరుః** ఏబీఎన్ జర్నలిస్ట్ పై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కు సోమవారం వినతిపత్రం అందించారు. హైదరాబాద్‌లో తెలంగాణ భవనం వద్ద మాజీ సీఎం కేసీఆర్ పై ఫోన్ టాపింగ్ పై సీట్ అధికారులు విచారణపై వార్తా సేకరణకు వెళ్లిన ఏబీఎన్ ఫోటోగ్రాఫర్ పై టిఆర్ఎస్ శ్రేణులు దాడికి పాల్పడటంపై జర్నలిస్టులు మిత్రుల తోపాటు సిపిఐ, టిడిపి నాయకులు పాల్గొన్నారు. మీడియా మిత్రబృందంతో పాటు సిపిఐ, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు, టిడిపి నాయకులు కాకర్ల రంగారావు మాట్లాడుతూ నాయకులైన దాడిలో పాల్పడితే రాజ్యాంగాన్ని హరించినట్లుగా పేర్కొన్నారు. పత్రికారంగంపై దాడులకు పాల్పడే సంస్కృతులను విరమించుకోవాలని సలహా ఇచ్చారు. ఈ సంఘటన పునరావృత్తం కాకుండా భవిష్యత్తులో ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం బాధ్యత వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్‌కు జర్నలిస్టుల మిత్రబృందం మున్నాఫ్, బుక్య శ్రీనివాస్‌రావు, పుల్లయ్య, నరేష్, రామకృష్ణ, రాధాకృష్ణ, సిపిఐ, టిడిపి కాకర్ల రంగారావు ,జాస్తి శ్రీనివాసరావు నాయకులు పాల్గొన్నారు.

# సిపిఐ అభ్యర్థి దామాల దయాకర్‌ను గెలిపించండి



**ప్రజాపక్షం/కల్లూరుః** ఈ నెల 11వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కల్లూరు 16వ వార్డు కౌన్సిలర్ గా భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి దామల దయాకర్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బి ఫారం ఇచ్చిన సందర్భంగా సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నరసింహారావు పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ కార్మికులు కష్టజీవుల ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. కల్లూరు తో పాటు ఏడు గ్రామపంచాయతీలు కలిసి నూతనంగా మున్సిపాలిటీ ఏర్పడిందని పారిశుద్ధ్యం డ్రైనేజీ తదితర అనేక సమస్యలు తిష్టవేశాయని అన్నారు. పరిపాలన సిబ్బంది పారిశుధ్యం కార్మికుల కొరత ఉందని, ఇప్పటికే కార్మికులు ఆరు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్మికుల, ప్రజల స్థానిక అభివృద్ధి సమస్యలపై అవగాహన కలిగిన కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి దామాల దయాకర్ ని గెలిపించాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గడచిన అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికలలో సిపిఐ సహకారంతో కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించిందని ఈ ఎన్నికల్లోనూ కలిసి పని చేయాలని ప్రయత్నించామన్నారు. కాంగ్రెస్ నుండి సానుకూల స్పందన లేకపోవడంతో ఒంటరిగానే సిపిఐ ఒక స్థానంలో పోటీ చేస్తున్నదని ఆ వార్డులో స్థానిక కాంగ్రెస్ వాదులు, ప్రజాస్వామిక వాదులు సిపిఐ అభ్యర్థి గెలుపుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, అభ్యర్థి దామల దయాకర్, ఎఐటియుసి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణి ఎన్‌సిసి ఆఫీసర్ శ్యాంసింగ్‌కు పదోన్నతి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో పిఈటి, అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్యాంసింగ్‌కు థర్డ్ ఆఫీసర్ నుంచి సెకండ్ ఆఫీసర్‌గా పదోన్నతి లభించింది. సోమవారం 11(టి) బెటాలియన్ కార్యాలయంలో నిర్వహించిన ర్యాంక్ ప్రధానోత్సవ కార్యక్రమంలో కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్‌కె భద్ర, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ నవీన్ యాదవ్ లు శ్యాంసింగ్ భుజాలపై షోల్డర్ స్టార్స్‌ను అధికారికంగా ధరింపజేశారు. ఈ కార్యక్రమం సైనిక సంప్రదాయాలు, క్రమశిక్షణతో గౌరవ ప్రదంగా నిర్వహించారు. శ్యాంసింగ్ ఎన్‌సిసి క్యాడెట్ల శిక్షణలో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాల అభివృద్ధికి అంకిత భావంతో సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా పదోన్నతి లభించడం గర్వకారణంగా ఉందని పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శ్యాంసింగ్‌ను స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

# ప్రజావాణిలో కార్మికుల సమ్మె నోటీసు అందచేత




**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై ఈ నెల 12న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా సోమవారం ఎర్రుపాలెంలోని ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన ప్రజవాణిలో ఎంపిడిఓ సురేందర్‌కు గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె నోటీస్‌ను అందచేశారు. ఈసందర్భంగా మండల గ్రామపంచాయతీ యూనియన్ అధ్యక్షులు గంతాల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు తమ ప్రాణాలను త్యాగం చేసి సాధించుకున్న హక్కులను చట్టాలను మోడి రద్దు చేసి పనిగంటలను పెంచే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. నూతనంగా ఎన్నికైన కొంతమంది గ్రామపంచాయతీ సర్పంచ్‌లు గ్రామపంచాయతీ కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నాని, ఆ పద్ధతి మానుకోవాలని కోరారు. గ్రామపంచాయతీ కార్మికులకు గత మూడు నెలలుగా వేతనాలు అందించటం లేదని, వెంటనే వేతనాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు దూదిగం శ్రీనివాసరావు, వంగూరి ప్రభాకర్‌రావు, యర్రగంపట కృష్ణారావు, బూసుపోగు ప్రసాద్, గద్దల అజప్ప, గోపి, ఈశ్వరమ్మ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/ మధిర టౌన్ :** మధిర మున్సిపాల్టీ మడుపల్లి గ్రామం నుంచి డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సమక్షంలో మడుపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి రేగళ్ల సాంబశివరావు, మాజీ కౌన్సిలర్ తొగరు వరలక్ష్మి , టిఆర్ఎస్ నాయకులు తొగరు ఓంకార్, 6వ డివిజన్ అధ్యక్షులు పారుపల్లి వీరభద్రం, 7వ వార్డు డివిజన్ అధ్యక్షులు తలారి శేఖర్‌బాబు, 5వ డివిజన్ సెక్రటరీ పంబి సాంబశివరావు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నీలం అప్పారావు, మేడికొండ ఆంథోని, పగడాల వెంకటేశ్వరరావు, వేల్పుల మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమీకృత వ్యవసాయమే ఉత్తమ మార్గం

**- కలెక్టర్ జితేష్ వి పాటిల్**

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** రైతులు స్థిరమైన నిరంతర ఆదాయాన్ని సాధించేందుకు సమీకృత వ్యవసాయ విధానమే ఉత్తమ మార్గమని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలం, లోతువాగు గ్రామంలో రైతు పడిగా ప్రశాంత్ ఏర్పాటు చేసిన సమీకృత వ్యవసాయ కేంద్రాన్నికలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అమలు చేస్తున్న సమీకృత అధునిక వ్యవసాయ పద్ధతులను అయన పరిశీలించారు. సమీకృత వ్యవసాయ కేంద్రంలో ఆకు కూరలు, మునగతో పాటు వివిధ రకాల పండ్ల మొక్కలను పూర్తిగా డ్రిప్ ఇరిగేషన్ విధానంలో సాగు చేస్తున్న తీరుపై కలెక్టర్ ప్రశంసించారు. నీటి వినియోగాన్ని సమర్ధవంతంగా నిర్వహిస్తూ అధిక దిగుబడులు సాదిస్తున్నందుకు రైతు ప్రశాంత్‌ను అభినందించారు. అలాగే యూనిట్‌లో కొనసాగుతున్న కొర్రమీన చేపల పెంపకం, మేకల పెంపకం, బ్యాక్ యార్డు మదిర్ యూనిట్, డక్స్ యూనిట్‌లను కూడా పరిశీలించన ఆయన వాటి నిర్వహణపై రైతులలకు పలుసూచనలు, సలహాలు అందించారు. ఈ తరహాల సమీకృత వ్యవసాయ యూనిట్లు జిల్లాలోని ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తాయన కలెక్టర్ అన్నారు. అనంతరం మైలవరం గ్రామంలో రైతు మాడె కృష్ణవేణి ఏర్పాటు చేసిన కౌజు పిట్టల యూనిట్‌ను కూడా ఆయన సందర్శించారు. కేవలం రూ.25 వేల తక్కువ పెట్టుబడితో షెడ్ నిర్మాణం, ఫెన్సింగ్, కౌజు పిల్లలు, ఫీడ్ అవసరమైన పరికరాలతో ఏర్పాటు చేసిన విధానాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. తక్కువ పెట్టుబడితో గ్రామీణ మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఈ యూనిట్లు జిల్లాలో పెద్ద ఎత్తున అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కనీసం 500 కౌజు పిట్టల యూనిట్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇదే గ్రామానికి చెందిన యువరైతు కుంజా సందీప్ అమలు చేస్తున్న ప్రకృతి సేంద్రీయ వ్యవసాయ విధానాన్ని పరిశీలించారు. అనేక రకాల సమీకృత పంటల సాగుతో పాటు జీవామృతం, పంచగవ్య వంటి సేంద్రీయ ఎరువుల తయారీ యూనిట్లను పరిశీలించి, సేంద్రీయ వ్యవసాయం



ద్వారా నేల సారవంతం పెరిగి, సాగు ఖర్చులు తగ్గటంతో పాటు రైతులకు దీర్ఘకాలిక లాభాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా యువరైతు కుంజా సందీప్‌ను కలెక్టర్ అభినందిస్తూ సేంద్రీయ సాగును మరింత విస్తృతంగా చేపట్టాలని పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ గ్రామంలోని యువ రైతులకు సమీకృత వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు సుజాతనగర్‌లోని రవి హైబ్రిడ్ సీడ్స్ కేంద్రాన్ని సందర్శించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమీకృత వ్యవసాయ విధానం రైతులకు స్థిరమైన, నిరంతర ఆదాయాన్ని అందించే ఉత్తమ మార్గమన్నారు. ఒకే వ్యవసాయ క్షేత్రంలో పంటల సాగుతో పాటు పశుపోషణ, పక్షులు పెంపకం, చేపల పెంపకం వంటి అనుబంధ కర్యకలాపాలను సమన్వయంతో చేపట్టడం వల్ల సాగులోని ప్రమాదాలు తగ్గి లాభాలు పెరుగుతాయని అన్నారు. డ్రిప్ ఇరిగేష్ వంటి ఆధునిక సాగునీటి పద్ధతుల వినియోగంతో నీటి వృధా తగ్గి దిబడులు మెరుగుపడతాయన్నారు. తక్కువ పెట్టుబడితో కౌజు పిట్టల యూనిట్లు, బ్యాక్‌యార్డ్ యూనిట్లు, సేంద్రియ వ్యవసాయం వంటి కార్యక్రమాలు గ్రామీణ యువత, మహిళలకు మంచి ఉపాధి అవకాశాలను కల్పిస్తాయన్నారు. జిల్లాలోని ఈ తరహా మోడల్ యూనిట్లను విస్తృతంగా ఏర్పాటు చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం వెంకయ్య, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తేగడ ఇసుక ర్యాంపుపై ముగిసిన వివాదం





**ప్రజాపక్షం/చర్ల :** తేగడ ఇసుక రీచ్ వివాదం ఎట్టకేలకు సద్దుమణిగింది. తేగడ గ్రామంలో సోమవారం తేగడ సర్పంచ్ జమ్మల మురళీ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గత రెండు రోజులుగా తేగడ ఇసుక రీచ్‌కి వెళ్లే రహదారి పై వివాదం చెలరేగింది. తాలిపేరు, గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఒడ్డున ఇసుక రీచ్ కాంట్రాక్టర్లు సుమారు 3కి.మీ మేర అక్రమంగా గ్రావెల్‌తో రహదారి నిర్మించారని తేగడ, మేడువాయి గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఇసుక రీచ్‌కి వచ్చి పోయే లారీలను నిలుపుదల చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. గోదావరి నది ఒడ్డున సీతమ్మ సాగర్ కరకట్ట నిర్మాణం కోసం కేటాయించిన భూముల్లో గ్రావెల్ రహదారి నిర్మించడం వల్ల రాబోయే వర్షాకాలంలో వరదలు వచ్చి తమ గ్రామాలు మునకకు గురవుతాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. తేగడ సర్పంచ్ గ్రామసభ నిర్వహించి సమస్యను పరిష్కరించుకుందామని హామీ ఇచ్చి సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అసలు సమస్య అయిన గ్రావెల్ రహదారి గురించి కాకుండా ఇసుక ర్యాంపుకు వచ్చే లారీ ఒక్కొక్క దానికి రూ.100 చొప్పున గ్రామ పంచాయితీకి చెల్లించాలని, ఇసుక లారీలకు టార్పల్ కట్టే పని గ్రామస్తులందరికీ అవకాశం కల్పించాలని చర్చించుకున్నారు. ఇసుక కాంట్రాక్టులు వేసిన రహదారి విషయంలో ఏదైనా ప్రమాదం జరిగినట్లయితే ఇసుస క్వారీ సొసైటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేయగా తేగడ ఇసుక క్వారీ సొసైటీ సభ్యులు దానికి నిరాకరించారని గ్రామస్తులు తెలిపారు. ఏది ఏమైనా గోదావరి నది ఒడ్డున పెసా కమిటీ తీర్మాణం లేకుండా నిర్మించిన అక్రమ గ్రావెల్ రహదారి విషయంలో పంచాయితీ పాలక వర్గం ఉదాసీనంగా వ్యవహరించిందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

# జీతాలు చెల్లించాలని కార్మికుల నిరసన

**మద్దతు తెలిపిన సిపిఐ నాయకులు**




**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు సోమవారం ఉదయం పంచాయతీ కార్యాలయం గేటు ముందు కూర్చొని తమ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలి, మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్ రైతు సంఘం జిల్లా నాయకులు మంగి వీరయ్య వార్డు మెంబర్లు వెంకటేశ్వర్లు వేరుపుల నరేష్ తదితరులు హాజరై పంచాయతీ కార్మికులకు తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ లు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు లు మాట్లాడుతూ మణుగూరు మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అయిన సమితి సింగారం పంచాయతీలో 33 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరిలో కొంతమందికి 11 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, మిగిలిన వారికి మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నటువంటి వీరికి జీతాలు ఇవ్వకపోవడం వల్ల ఇల్లు గడిపే పరిస్థితి లేక అనేక ఇబ్బందులు పడుతున్నార ని కనీసం పిల్లల చదువు, కూడా చదివించుకోలేక నానా అవస్థలు పడుతున్నారని, ఎన్నిసార్లు అధికారులకు చెప్పిన ఎవరు పట్టించుకోవడంలేదని 11 నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాలు రావడంలేదని మా జీతాలు మాకు ఇప్పించండి అని అధికారులకు వేడుకుంటే చేస్తే చేయండి లేకపోతే మానుకోండి అనే విధంగా వారు మాట్లాడుతున్నారని, అధికారులు ఈ విధంగా పనిచేయించుకొని జీతం అడిగితే ఇష్టానుసారంగా మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా వారు సమస్యలు జీతాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవాలని వారి డిమాండ్ చేశారు. వారికి రావాల్సినటువంటి అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పంచాయతీ కార్మికులు చేస్తున్న ఆందోళనకు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని భవిష్యత్తులో వీరి జీతాలు వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో వారికి మద్దతుగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సింగారం గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# అర్హులైన గిరిజనులందరికీ సంక్షేమ పథకాలు

**- ఐటిడిఏ పిఓ రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** అర్హత గల గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అందిస్తామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ సమస్యలపై విన్నవించేందుకు వచ్చిన గిరిజనుల నుండి యూనిట్ అధికారుల సమక్ష్యంలో ఆయన అర్జీలను స్వీకరించారు. వాటిని పరిశీలించి సంబంధిత యూనిట్‌ల అధికారులకు బట్వాడా చేశారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకు ఓర్చి ఇక్కడిదాక వచ్చి దరఖాస్తులు సమర్పించిన గిరిజనులకు న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలన్నారు. నిజమైన అర్హులకు న్యాయం జరిగిన నాడే అధికారుల పనితీరుకు కితాబు దక్కుకుందని చెప్పారు. గిరిజన సంక్షేమం కోసం ఏర్పాటైన ఐడిడిఏల ద్వారా గిరిజన జీవితాలకు మేలుచేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిడి అశోక్, ఇఇ మధుకర్‌తో పాటు పలుశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కొరకు దరఖాస్తు చేసుకోండి

**- ఐటిడిఏ పిఓ రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** 202526 విద్యా సం.కు గానూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యను అభ్యశిస్తున్న గిరిజన విద్యార్థినీ విద్యార్థులు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ తెలిపారు. 5 నుండి 8 తరగతులు చదివే బాలురకు రూ.1 వెయ్యి, బాలికలకు రూ.1500 ఏడాది మొత్తానికి మంజూరవుతాయని చెప్పారు. రాజీవ్ విద్యాదీవెన స్కీమ్ ద్వారా 9,10 తరగతులు చదువుతున్న డేస్ స్కాలర్స్‌కు రూ.2250, హాస్టలర్స్ కు రూ.4500 సం.కు మంజూరు అవుతాయన్నారు. విద్యార్థులు కుల, ఆదాయం ధృవీకరమ పత్రాలు, బ్యాంక్ పాస్ పుస్తకములతో డబ్ల్యూడబ్ల్యూ,డబ్ల్యూ. తెలంగాణఇపాస్, సిజిజి.గవ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా మార్చి 31వ తేది నాటికి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని పిఓ సూచించారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలంలోని ప్రజా భవన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు రూ.60,000/ విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవసరంలో ఉన్న ప్రజలకు ప్రభుత్వ సహాయాన్ని అందించడం తమ బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వం పేదలు, బాధితులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చింతిర్యాల వీరభద్రం, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా, సీనియర్ నాయకులు పోలమూరి రాజు, విప్పల సింగారం సర్పంచ్ పాల్వంచ రాములు, ఉప సర్పంచ్ గోరంట్ల కనకయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కంటతడితో పాఠాలు నేర్చుకునేందుకు కదులుతున్న చిన్నారుల పాదాలు

**-తక్షణమే శ్రీరాంపురం ఎస్టీ కాలనీ ప్రజలకు సౌకర్యాలను అందించాలి**

**-చిన్నారుల అవస్థలపై సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మువ్వా ఆవేదన**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని సారపాక శ్రీరాంపురం ఎస్టీ కాలనీ పసికందుల అవస్థలు మారేది ఎన్నడూ అంటూ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మువ్వా వెంకటేశ్వర్లు(లడ్డా)ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంపురం ఎస్టీ కాలనీ నుండి గిరిజన చిన్నారులు చదువుకునేందుకు సుమారు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ సారపాక ప్రభుత్వ పాఠశాలకు వెళుతున్నారని, మరల రెండు కిలోమీటర్లు నడుస్తూ ఇంటికి రావాల్సిన పరిస్థితి చోటు చేసుకుందన్నారు. శ్రీరాంపురం ఎస్టీ కాలనీలో అంగన్వాడీ కేంద్రం ప్రైమరీ స్కూల్ లేకపోవడంతో చిన్నారులు విద్యను అభ్యసించేటందుకు అనేక రకాలుగా పాట్లు పడాల్సి వస్తుందన్నారు. గతంలో శ్రీరాంపురం ఎస్టీ కాలనీలో అంగన్వాడీ సెంటర్, ప్రైమరీ స్కూల్, హెల్త్ సెంటర్ కట్టించ్చేటందుకు సిపిఐ పార్టీ నుండి అనేక పోరాటాలు చేయగా ఐటిడిఏ పిఓ త్వరలోనే సమస్యను పూర్తి చేస్తామని తెలియజేసినప్పటికీ, ఇప్పటి వరకు ఆ పనులను పూర్తి చెయ్యకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే శ్రీరాంపురం ఎస్టీ కాలనీ ప్రజలకు అందించాల్సిన సౌకర్యాలను త్వరగా అందించాలని డిమాండ్ చేశారు.

# దహన సంస్కారాలకు ఆర్థికసాయం

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండలం నారాయణపురం గ్రామంలో ప్రమాదవశాత్తు దొండపాటి అబ్రహం సోమావారం మృతి చెందారు. మృతుని కుటుంబం ఆర్థిక పరిస్థితులను తెలుసుకున్న దోమందుల చిన్న ముత్తయ్య ట్రస్టు నుండి దోమందుల రవి చేతుల మీదుగా రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో గూడురూ వెంకటేశ్వర్‌రెడ్డి, కోగంటి సత్యనారాయణ, బొగ్గుల సత్యనారాయణరెడ్డి, వేముల శ్రీనివాసరావు, బొడ్డపాటి బాబు, దొడ్డపాటి వెంకటరత్నం, గొల్లమందల వెంకటేశ్వరరావు, గొల్లమందల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# భట్టి మొగ్గు ఏవైపుకు..

**-ఛైర్‌పర్సన్ రేసులో ముగ్గురు**
**-ఉన్నది ఒక్కటే స్థానం..**
**అంతా అనుకూలురే**



**ప్రజాపక్షం/ మధిర :** ఇప్పుడు అందరి చూపు భట్టి నిర్ణయం వైపు ఉంది. మధిర మున్సిపల్ ఛైర్‌పర్సన్ విషయంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, స్థానిక మధిర శాసన సభ్యులు మల్లు భట్టివిక్రమార్క ఏ నిర్ణయం తీసుకుంటారన్న దానిపై మధిర పట్టణ ప్రజలతో పాటు జిల్లా రాజకీయ నేతలు సైతం చూస్తున్నారు. మధిర మున్సిపల్ స్థానం జనరల్ మహిళకు రిజర్వు అయింది. ముగ్గురు నేతల సతీమణులు ఈ స్థానం కోసం పోటీ పడుతున్నారు. ఈ ముగ్గురు కూడా భట్టికి అనేక సందర్భాల్లో బాసటగా నిలిచిన వారే. భట్టి విక్రమార్క విజయంలో వీరు కీలక పాత్ర పోషించారు. రంగా హన్మంతరావు సతీమణి మధులత, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి సతీమణి లక్ష్మి తులసి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మల్లాది వాసు సతీమణి తాజా మాజీ కౌన్సిలర్ మల్లాది సవిత ఛైర్‌పర్సన్ స్థానాన్ని ఆశిస్తున్నారు. వీరిలో ఎవరిని ఛైర్‌పర్సన్ పదవి వరిస్తుందన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. భట్టి మదిలో ఈ ముగ్గురిలో ఎవరున్నరన్నది కాంగ్రెస్ నేతలకు సైతం అంతు పట్టడం లేదు. ఈ ముగ్గురి నేపథ్యం కాంగ్రెస్ పార్టీయే కావడం వివిధ సందర్భాల్లో కాంగ్రెస్‌ను గెలుపుబాట పట్టించిన వారు కావడం గమనార్హం. ఒక కీలక దశలో మల్లాది వాసు కాంగ్రెస్ పార్టీని మధిర నియోజక వర్గంలో గెలిపించడంలో కీలక భూమిక పోషించారు. ఒక సామాజిక వర్గాన్ని కొంత మేర కాంగ్రెస్ వైపు తిప్పడంలో ఈయన సఫలీకృతం కావడం వల్లే విజయం దక్కింది. మరొకరు శ్రీనివాసరెడ్డి ఆది నుంచి భట్టివిక్రమార్క ప్రధాన అనుచరునిగా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. తొలిసారి అవకాశం రావడంతో ఎట్టి పరిస్థితుల్లోనైనా ఛైర్‌పర్సన్ స్థానాన్ని దక్కించుకోవాలని ఆయన ప్రయత్నిస్తున్నారు. రంగా హన్మంతరావు ఆది నుంచి కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ వివాద రహితుడిగా పేరు ఉంది. ముగ్గురు ముగ్గురే అర్హతల విషయంలోనూ ముగ్గురు ముందు వరుసలోనే ఉంటారు. ఇటువంటి పరిస్థితిల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలు గెలిస్తే భట్టి ఎవరి వైపు మొగ్గు చూపుతారన్నది తేలాల్సి ఉంది.

# మిర్చి పంటను పరిశీలించిన చైనా వ్యాపారులు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని కోయచలక గ్రామంలో చైనా వ్యాపారులు పర్యటించి మిర్చి పంటను పరిశీలించారు. సోమవారం కోయచలకలో ముగ్గురు చైనా వ్యాపారులు పర్యటించి మిర్చి తోటలను, కల్లాల్లో ఉన్న మిర్చిని పరిశీలించారు. రైతులు మిర్చి సాగు చేస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. విత్తనం నాటింది మొదలు కోత వరకు తీసుకుంటున్న జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. రసాయనాల వినియోగం, దిగుబడుల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. మిర్చి తోటలతో పాటు కల్లాల్లో ఉన్న మిర్చిని వీడియోలు తీసుకున్నారు. మిర్చి నాణ్యత, సాగు విధానం బాగుందని వ్యాపార బృందం కొనియాడింది.మన జిల్లాలో పండించే మిర్చికి అంతర్జాతీయంగా డిమాండ్ ఉండడంతో చైనా వ్యాపారులు క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించడం చర్చనీయాంశమైంది.

# రబీ సీజన్ ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలి

**-యూరియా పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి**
**-జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రబీ సీజన్ ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో రబీ ధాన్యం సేకరణ, యూరియా పంపిణీ, మున్సిపల్ ఎన్నికలు, జిల్లా అధికారుల హాజరుపై అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డిలతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రబీ సీజన్ దిగుబడి అంచనాలకు తగినట్లు కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సమస్యలను అధిగమించాలన్నారు. మిల్లర్లకు కొనుగోలుపై ముందే అవగాహన కల్పించాలని సమస్యలు ఉంటే ముందుగానే పరిష్కరించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలన్నారు. యూరియా పంపిణీ వంద శాతం యాప్ ద్వారా జరుగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. అధికారులు యూరియా పంపిణీపై నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. యూరియా నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. కొరత ఉంటే ముందస్తుగానే తెలపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని ఎన్నికల అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది శిక్షణకు ఏర్పాటు చేయాలన్నారు. కేబుల్ బ్రిడ్జి నిర్మాణంతో షాపులు కోల్పోయిన వారితో మాట్లాడి స్థలం గురించి ఒక స్ట్రీట్ వెండర్ జోన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. దానవాయిగూడెం బాలికల హాస్టల్ వరదల్లో దెబ్బతినగా వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ప్రతిపాదిత అన్ని పనులు పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లా అధికారులు తమ క్షేత్ర పర్యటనలు కొనసాగించాలన్నారు. పాఠశాల, హాస్టళ్ల సందర్శన, భోజన నాణ్యత పరిశీలన, ప్రాధాన్యత పనుల పర్యవేక్షణ, ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణ చేయాలన్నారు. సిబ్బంది హాజరు మెరుగవ్వాలన్నారు. అనుమతి లేని గైర్హాజరు పై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం నుండి సరఫరా అయినా హ్యాండ్ హెల్డ్ ఎక్స్‌రే పరికరాన్ని కలెక్టర్ ప్రారంభించి వైద్య ఆరోగ్య శాకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, అడిషనల్ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ చందునాయక్, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్, టిబి నియంత్రణ అధికారిడాక్టర్ సుబ్బారావు,అధికారులు పాల్గొన్నారు.

# పేదలను విద్యకు దూరం చేస్తున్న కేంద్రం



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన పద్దులో విద్యారంగానికి తీరని అన్యాయం జరిగిందని, కేంద్రం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ పేదలను విద్యకు దూరం చేసే కుట్రకు తెగబడుతోందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే షాహీద్, వరక అజిత్ అన్నారు. 12 ఏళ్ల మోడి పాలనలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లలో విద్యారంగానికి సుముచిత స్థానం దక్కడం లేదన్నారు. ఈ ఏడాది రూ.53.5 లక్షల కోట్లు మొత్తం బడ్జెట్‌లో విద్యకు కేటాయించిన నిధులు కేవలం రూ.139289 కోట్లని, ఇది 2.6 శాతం మాత్రమే అన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన హామీ చట్టంలో ఉన్న విద్యా సంస్థలను కేటాయించకుండా అడుగడుగునా మొండి వైఖరిని ప్రదర్శిస్తుందని, 8 మంది బిజెపి ఎంపిలు ఉన్నప్పటికీ తెలంగాణకు రావాల్సిన నిధులు, హక్కుల గురించి నోరుమెదపలేని పరిస్థితి నెలకొందన్నారు. గత ఏడాది బడ్జెట్ 4821000 లక్షల కోట్లు కాగా విద్యకు కేటాయించింది 128628 కోట్లు, మొత్తంగా బడ్జెట్‌లో 2.6 శాతం మాత్రమే కేటాయింపులు చేశారని, బడ్జెట్ కేటాయింపులు లేకుండా ఎన్ని ప్రసంగాలు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో పేద,మధ్య విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మిగులుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

# యువతను విస్మరించిన బడ్జెట్



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ఉపాధి కల్పనలో యువతను విస్మరించారని కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా విమర్శించారు. దేశంలో నిరుద్యోగం పెరిగినప్పటికీ కేంద్ర ఉపాధి కల్పనకు బడ్జెట్లో ఎటువంటి స్పష్టమైన ప్రణాళికను ప్రతిపాదించలేదని నిరుద్యోగం, ధరల పెరుగుదల ఆదాయల క్షీణత వంటి తీవ్రమైన సమస్యలను పరిష్కరించకుండా కార్పొరేట్ వ్యవస్థకు అనుకూలంగా బడ్జెట్ ను రూపొందించారని విభజన హామీలను పూర్తిగా విస్మరించారని, విద్య రుణాల భారంతో నలుగుతున్న పేద మధ్యతరగతి యువతకు రుణ మాఫీ అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, యువతను నిర్లక్ష్యం చేస్తూ దేశ భవిష్యత్తును నిర్మించలేరన్నారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్ కు యువత గల మెత్తని ఉపాధి విద్య హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని, దేశ సంపదను దోచుకుంటున్న కార్పొరేట్ వ్యవస్థకు అనుకూలంగా బడ్జెట్ ఉందని విమర్శించారు.

# విద్యుత్ శాఖ అభివృద్ధిలో మరో కీలక ఘట్టం

**ఎలక్ట్రికల్ ఏడీ కార్యాలయ నూతన భవన**
**ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం**



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం గుట్ట మల్లారం పంచాయతీ పరిధిలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ఎలక్ట్రికల్ ఏడీ కార్యాలయ నూతన భవన ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన భవనాన్ని శుభప్రదంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన విద్యుత్ సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ఈ ఎలక్ట్రికల్ ఏడీ కార్యాలయం ప్రారంభం కావడం ద్వారా మణుగూరు మండలం తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు విద్యుత్ సమస్యల పరిష్కారం మరింత సులభతరం అవుతుందని అన్నారు. విద్యుత్ సంబంధిత ఫిర్యాదులు, పరిపాలనా పనులు ఇకపై స్థానికంగానే త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. అలాగే పినపాక నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిరంతరంగా కొనసాగుతున్నాయని, మౌలిక సదుపాయాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా రహదారులు, తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాల విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఈ నూతన ఎలక్ట్రికల్ ఏడీ కార్యాలయం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందడంతో పాటు, విద్యుత్ శాఖ సిబ్బందికి కూడా సౌకర్యవంతమైన పని వాతావరణం ఏర్పడుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎలక్ట్రిసిటీ) మహేందర్, డీఈ జీవన్ కుమార్, ఎస్ఏఓ శ్రీధర్, ఏడీఈ ఉమా మహేశ్వర్ రావు, ఏఏఓ సత్యనారాయణ, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, 14 టైర్ యూనియన్ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, బొగ్గు ముఠా అధ్యక్షులు రాంబాబు, సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవ రావు, విప్పల సింగారం సర్పంచ్ పాల్వంచ రాములు, గుట్ట మల్లారం సర్పంచ్ కారం పూజిత, కట్టు మల్లారం సర్పంచ్ జగిడి ప్రసాద్, లంక మల్లారం సర్పంచ్ పూణెం రమేష్, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ , విప్పల సింగారం ఉప సర్పంచ్ గోరంట్ల కనకయ్య , సభ్యులు కోలపిన్ని మానస , కృష్ణవేణి, సీనియర్ నాయకులు పోలమూరి రాజు, కుర్రం రవి, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# వలస కూలీల ప్రేమ జంటను ఒక్కటి చేసిన రైతులు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మధ్యప్రదేశ్‌కు చెందిన వలస కూలీలు ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని మోటాపురం లోని భూక్యా మోహన్ రావు, భూక్యా లక్ష్మణ్ లు అనే రైతులకు మిర్చి తోటలో కాయలు వేరేందుకు ఓ ముఠా వస్తారు. ఇలా దాదాపు ఐదేళ్ల నుంచి గ్రామంకు వలస వచ్చి, 4 నెలలు పాటు గ్రామంలో మిర్చి తోటలో ఇతర పనులు చేసుకునే వారు. మిర్చి తో పాటు ఇతర పనులు చేసుకుని తిరిగి వారి సొంత గ్రామం కు వెళ్లారు. ఇలా వచ్చిన గుంపులో ఓ జంట ప్రేమలో పడ్డారు. పూల్ సింగ్ (24), ఆశా (19) అనే ఇరువురు గత మూడేళ్ల గా ప్రేమించుకుంటున్నారు. వీరి ప్రేమ ను గుర్తించిన సదరు రైతు సోదరులు ఇరువర్గాల తల్లిదండ్రులను ఫోన్ ద్వారా కౌన్సిలింగ్ చేసి ఒప్పించారు. వారి అంగీకరం తెలిపిన తరువాత ముఠా మొత్తం తో చర్చించి అన్ని తానై రైతు సోదరులు సోమవారం స్థానిక వీరన్న స్వామి దేవాలయం లో అంగరంగ వైభవంగాకళ్యాణం జరిపించారు. అందుకు అవసరమైన భోజనాలతో పాటు ఇతర ఖర్చులను సైతం రైతు సోదరులు భరించారు. అంతే కాదు. ఈ వివాహం కు గ్రామంలోని గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని నూతన వధువరులను ఆశ్వీరదించారు. సీపీఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, భాగం నరసింహారావు, మూడు శ్రీను, కాశయ్య, మాధవ్ తదితరులు పాల్గొని రైతు సోదరులను అభినందించారు.